సూర్య నేటి దినపత్రిక www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
19-08-2025
పేజీలు: 02



## జులైలో 5.2 శాతానికి తగ్గిన నిరుద్యోగిత రేటు

దేశంలో నిరుద్యోగిత రేటు జులైలో 5.2 శాతానికి తగ్గింది. జూన్‌లో ఇది 5.6 శాతంగా ఉంది. గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్‌ఎఫ్‌ఎస్)లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. పురుషుల నిరుద్యోగిత రేటు 5.3 శాతం, మహిళలది 5.1 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రేటు 4.9 నుంచి 4.4 శాతానికి తగ్గగా, పట్టణ ప్రాంతాల్లో 7.1 నుంచి 7.2 శాతానికి స్వల్పంగా పెరిగింది.

## ఆషికా అందాలు

ఆషికా రంగనాథ్.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన హీరోయిన్. చేసింది తక్కువ సినిమాలే అయినా అందం, అభినయంతో కట్టిపడేసింది. అలాగే ఈ అమ్మడి నటనకు మంచి మార్కులు పడ్డాయి. నటించిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ ఆఫర్స్ రావడం లేదు.స్లో అండ్ స్టడీగా సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది ఈ బ్యూటీ. అందరిలా యంగ్ హీరోల పక్కనే కాదు.. సీనియర్ హీరోల సరసన కూడా నటిస్తుంది. నాగార్జున నటించిన నా సామీ రంగ సినిమాలో నటించింది.





# ముంబైలో భారీ వర్షం


దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మంగళవారం కూడా భారీ వర్షం కొనసాగుతోంది. కుండపోత వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కారణంగా పాఠశాలలు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సెలవు ఇచ్చారు. కొనసాగుతున్న భారీ వర్షం నేపథ్యంలో ప్రైవేటు సంస్థలు కూడా తమ ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. ఆర్థిక రాజధానిలో నిరంతరాయంగా కొనసాగుతున్న కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. విమాన రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ రాడార్ డేటా ప్రకారం.. దాదాపు 250 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబై ఎయిర్‌పోర్ట్‌నుంచి బయల్దేరే దాదాపు 155 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముంబైకి వచ్చే విమానాలు కూడా ఆలస్యం అవుతున్నాయి. దీంతో పలు ఎయిర్‌లైన్స్ తమ ప్రయాణికులకు ట్రావెల్ అడ్వైజరీలు జారీ చేశాయి. మరోవైపు రైల్వే ట్రాక్‌లపై పెద్ద ఎత్తున నీరు చేరటంతో సెంట్రల్ రైల్వే మార్గంలో పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇదిలా ఉండగా.. ముంబై నగరం, శివారు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ అలర్ట్‌తో అధికారులు అప్రమత్తమయ్యారు.

## ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ప్రతిపక్షాలు మద్దతివ్వాలి: ప్రధాని మోదీ



వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డీఏ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను తమ అభ్యర్థిగా బరిలోకి దింపింది. ఈ నేపథ్యంలో ఎన్‌డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. సీపీ రాధాకృష్ణన్ వివాదాలు లేని జీవితాన్ని గడిపారని, ఆయన చాలా వినయపూర్వకమైన వ్యక్తి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ప్రతిపక్షాలు సహా అన్ని పార్టీలూ సహకరించాలని కోరారు. ఈ విషయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్ని పార్టీల ఎంపీలతో నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. పార్లమెంటులోని బాలయోగి ఆడిటోరియంలో ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్‌డీఏ ఎంపీలకు ప్రధాని మోదీ పరిచయం చేశారు. అనంతరం ఆయనను ప్రధాని, కేంద్ర మంత్రులు సన్మానించారు.

## నటుడు అచ్యుత్ పోట్దార్ కన్నుమూత




సినీ పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. ఇప్పటికే పలువురు ప్రముఖుల మరణ వార్తలతో విషాదంలోకి వెళ్లిన భారతీయ చలనచిత్ర పరిశ్రమకి మరో షాక్ తగిలింది. '3 ఇడియట్స్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రంలో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటుడు అచ్యుత్ పోట్దార్ (91) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మహారాష్ట్రలోని థానేలో ఉన్న జుపిటర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. నటుడిగా ప్రవేశించడానికి ముందు, అచ్యుత్ పోత్దార్ భారత సాయుధ దళాలలో సేవలందించారు. ఆ తర్వాత సినీ రంగంలోకి అడుగుపెట్టి దాదాపు 125 చిత్రాలలో నటించారు. బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ నటించిన '3 ఇడియట్స్' సినిమాలో ప్రొఫెసర్ పాత్రలో ఆయన నటనకు మంచి గుర్తింపు లభించింది. ఈ చిత్రం కెహ్నా క్యా చాహతే హో (ఏం చెప్పాలనుకుంటున్నావు) అనే డైలాగ్ ఈ సినిమాలోనే ఐకానిక్ డైలాగ్‌గా నిలిచింది. ఇక అచ్యుత్ పోత్దార్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం ప్రకటిస్తున్నారు.



## ఏడుపాయలలో కొనసాగుతున్న వరద ఉధృతి

మెదక్ జిల్లాలలోని ఏడుపాయల వనదుర్గా ఆలయం చుట్టూ వరద ఉధృతి కొనసాగుతోంది. భారీ వర్షాల కారణంగా వరదలు రావడంతో ఆరు రోజులుగా ఆలయం జలదిగ్బంధంలో ఉంది. అమ్మవారి గర్భాలయ దర్శనం నిలిపివేసిన ఆలయ పండితులు.. రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో SDRF సిబ్బందితో అధికారులు నిరంతర గస్తీ నిర్వహిస్తున్నారు.




## 'కాంతార' నుంచి కులశేఖరుడి పరిచయం

కన్నడ నటుడు రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాంతార చాప్టర్ -1. బ్లాక్‌బస్టర్ మూవీ'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా ఈ సినిమా రాబోతుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 02న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా ఇప్పటికే కథానాయిక రుక్మిణి వసంత్‌ని పరిచయం చేసిన చిత్రయూనిట్ తాజాగా మరో కీలక పాత్రను పరిచయం చేసింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కులశేఖర పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించారు. ఈ పోస్టర్ చూస్తుంటే గుల్షన్ ఇందులో విలన్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.



## నూతన బార్ పాలసీకి నోటిఫికేషన్ విడుదల

నూతన బార్ పాలసీకి నోటిఫికేషన్ విడుదల అయింది. మొత్తం 840 బార్లకు నోటిషికేషన్ ఇవ్వగా.. ఇందులో 10 శాతం గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ కేటాయించింది. ఈ నెల 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 28న లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అమల్లోకి రానుంది. దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు ఉంటుంది. బార్ల లైసెన్స్ ఫీజు జనాభా ఆధారంగా రూ.35-75 లక్షలుగా ఉంటుంది.



## భారత చీఫ్‌కోచ్‌గా ధోనీ!

భారత క్రికెట్ జట్టు చీఫ్ కోచ్‌గా మహేంద్రసింగ్ ధోనీ అయితే బాగుంటుందని మాజీ క్రికెటర్ ఆకాశ్‌చోప్రా అభిప్రాయపడ్డాడు. ప్రస్తుత కోచ్ గౌతం గంభీర్ నేతృత్వంలో టీమ్‌ఇండియా మిశ్రమ ఫలితాలు సాధిస్తుందని, ధోనీ కోచ్ అయితే పరిస్థితిలో మార్పు రావచ్చని అన్నాడు. 2021 టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాకు మెంటార్‌గా వ్యవహరించిన ధోనీ.. ఐపీఎల్‌లో చెన్నైకి సారథ్యం వహిస్తున్న కారణంగా కోచింగ్ బాధ్యతలకు దూరంగా ఉంటున్నాడని తెలిపాడు. 'టీమ్‌ఇండియాకు కోచ్‌గా పని చేసేందుకు అతను ఆసక్తితో ఉన్నట్లు అనుకోవడం లేదు. కోచింగ్ అనేది క్లిష్టమైనది. సంవత్సరంలో దాదాపు 10 నెలలు కుటుంబానికి దూరంగా గడపాల్సి ఉంటుంది. అందుకే చాలా మంది క్రికెటర్లు కోచింగ్ వైపు మొగ్గుచూపడం లేదు. దేశ క్రికెట్‌కు ఏమైనా చేయాలనుకుంటే ధోనీ కోచ్‌గా వస్తే బెటర్' అని అన్నాడు.

నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com

# ప్రధాని మోదీని కలిసిన శుభాంశు శుక్లా




అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంకు వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ భేటీలో శుక్లా దేశానికి గర్వకారణమైన ఒక బహుమతిని ప్రధాని మోదీకి అందజేశారు. అంతరిక్షంలో తనతో పాటు ప్రయాణించి వచ్చిన భారత త్రివర్ణ పతాకాన్ని ఫ్రేమ్ చేయించి మరీ ప్రధానికి బహూకరించారు. దీంతో పాటే మరో బహుమతి కూడా ఆయనకు బహూకరించారు. ప్రధాని మోదీ శుక్లాను సాదరంగా ఆలింగనం చేసుకుని స్వాగతం పలికారు. అంతరిక్షంలో భారత దేశాన్ని ప్రతిబింబించినందుకు ప్రధాని మోదీ శుభాంశు శుక్లాను అభినందించారు. ISSకు వెళ్లి వచ్చిన క్రమంలో ఎదురైన అనుభవాలను, సవాళ్లను ప్రధాని మోదీకి శుక్లా వివరించారు. అంతరిక్షంలో శుక్లా అనుభవాలు, అంతరిక్ష విజ్ఞానంలో తాజా పురోగమనాలు, భారత్ ప్రతిష్టాత్మక 'గగన్‌యాన్' మిషన్ భవిష్యత్తు గురించి చర్చించారు. అంతేకాకుండా త్రివర్ణ పతాకంతో పాటు శుక్లా తన మిషన్‌కు సంబంధించిన ప్రత్యేక మిషన్ ప్యాచ్‌ను కూడా ప్రధానికి బహూకరించారు.



# అజిత్‌తో శ్రీలీల

బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైన శ్రీలీల, అటు తమిళ్‌లో కూడా గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. శివకార్తికేయన్ 'పరాశక్తి' సినిమాతో తమిళంలో గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది ఈ చిన్నది. అయితే, ఇప్పుడు మరో స్టార్ హీరో సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేసిందట శ్రీలీల. తమిళ హీరో అజిత్ నెక్స్ట్ సినిమాలో ఆయనతో రొమాన్స్ చేసే పాత్రలో శ్రీలీల నటించబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ డైరెక్ట్ చేయనున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. మరి ఈ సినిమాలో అజిత్‌తో శ్రీలీల రొమాన్స్ ఏ లెవెల్‌లో ఉంటుందో చూడాలి.



# కూకట్‌పల్లి బాలిక హత్య కేసులో కీలక పరిణామం

తెలంగాణ రాష్ట్రంలో సంచలన సృష్టించిన కూకట్‌పల్లి మైనర్ బాలిక సహస్ర మర్డర్ కేసులో కీలక పురోగతి చోటుచేసుకుంది. ఒక అనుమాతుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాలిక ఉంటున్న బిల్డింగ్‌లోనే అద్దెకు ఉంటున్న సంజయ్ అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలిక సహస్ర హత్య తరువాత సంజయ్ అక్కడకక్కడే తిరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ అనుమానంతో సంజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.కూకట్‌పల్లిలోని సంగీత్‌నగర్‌లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న 11 ఏళ్ల బాలిక సహస్రని గుర్తు తెలియని వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. బాలిక గొంతుకోసి.. ఆపై కడుపులో పొడిచి కిరాతకంగా చంపేశారు. అయితే ఈ కేసు దర్యాప్తులో భాగంగా.. చుట్టుపక్కల ఉన్న వందల సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. దుండగుడు ఇంట్లో చొరబడి బాలికపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించి ఉంటాడని.. తప్పించుకోవడానికి ప్రయత్నించిన బాలిక ప్రతిఘటించడంతోనే నిందితుడు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.







# నిజామాబాద్‌లో ఏటీఎం చోరీకి విఫల యత్నం..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఏటీఎంలో చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పట్టణంలోని చంద్రశేఖర్ కాలనీలో ఉన్న ఏటీఎం సెంటర్‌కు మారుతీ వ్యాన్‌లో వచ్చిన దుండగులు.. గ్యాస్ కట్టర్‌తో మెషిన్‌కు కట్ చేశారు. అయితే అందులోనుంచి డబ్బులు తీసేందుకు ప్రయత్నిస్తుండగా అదేసమయంలో అటువైపుగా వచ్చిన పెట్రోలింగ్ టీమ్‌ను చూసి వ్యాన్‌లో పరారయ్యారు. దుండగులు నిర్మల్ జిల్లా బాసర వైపు పారిపోతుండగా చూసిన పెట్రోలింగ్ సిబ్బంది జిల్లావ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు తమను వెంబడిస్తున్నారని గుర్తించిన దుండగులు పాల్ద గ్రామ శివారులో వ్యానును వదిలేసి పరారయ్యారు. దీంతో మారుతి వ్యాన్‌తో పాటు అందులో ఉన్న గ్యాస్ కట్టర్లను సీజ్ చేశారు. దుండగులు ఉపయోగించిన కారు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్ ఉండటంతో వారు మహారాష్ట్రకు చెందిన అంతరాష్ట్ర దొంగల ముఠగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా కరెంట్ షాక్..

# ఇద్దరు యువకులు దుర్మరణం

హైదరాబాద్ రామంతాపూర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకుల్లో విషాదం మరువకముందే బండ్లగూడలో మరో ఘటన చోటుచేసుకున్నది. వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్‌తో ఇద్దరు యువకులు మృతిచెందారు. కొందరు యువకులు భారీ వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బండ్లగూడ వద్ద లంబోదరుడి విగ్రహానికి హై టెన్షన్ వైరు తరగలడంతో ట్రాక్టర్‌కు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిని అఖిల్ అనే యువకుడిని దవాఖానకు తరలించారు. మృతులను టోని (21), వికాస్ (20)గా గుర్తించారు. కరెంటు షాక్‌తో ట్రాక్టర్ టైర్లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో క్రేన్ సహాయంతో వినాయక



విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# హీరో విజయ్ ధీమా.. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం మాదే..

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తమదేనని టీవీకే అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ప్రజలతో కలిసిపోయి, వారితో మమేకమైన పార్టీగా వచ్చే ఎన్నికల్లో నిరూపించబోతున్నట్లు విజయ్ వెల్లడించారు. మన లక్ష్యాన్ని చేరుకునేందుకు, మన కలల్ని నెరవేర్చుకునేందుకు కొన్ని నెలల సమయం మాత్రమే ఉందన్నారు. 1967, 1977లో వచ్చిన ఎన్నికల ఫలితాలను మళ్లీ 2026లో చూడబోతున్నామని వెల్లడించారు. మహా ప్రజాశక్తిగా ఉన్న మీరంతా కలిసి ఈ కలను నెరవేర్చబోతున్నట్లు పేర్కొన్నారు. 'తమిళ ప్రజలను ప్రాణానికి ప్రాణంగా భావించే ఈ విజయ్ గురించి మీకు బాగా తెలుసు. వచ్చే ఎన్నికల్లో మన పార్టీ విజయం కోసం అభిమానులు, యువతీ యువకులు, మహిళలు,పురుషులు, వృద్ధులు ఇలా చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి' అని పిలుపునిచ్చారు. కేవలం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మనసాక్షి ఉన్న ప్రజాపాలన అందిస్తామని, ఇందుకోసం అధికార లక్ష్యం దిశగా పయనిస్తామని, వచ్చే ఎన్నికల్లో తమిళ గడ్డపై సరికొత్త ఫలితాన్ని చూపించడం ఖాయమన్నారు. ఎన్నికలు అనే రాజకీయ యుద్ధంలో గెలుస్తామని, అంతా మంచే జరుగుతుందని, విజయం తథ్యమని విజయ్ ధీమా వ్యక్తం చేశారు.

# కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు నోటీసులు

నేషనల్ స్పోర్ట్స్ కోడ్-2011ను అమలు చేయకపోవడంపై వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌కు హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. పార్ట్‌టైం సభ్యులు, ఉద్యోగులతో అసోసియేషన్‌ను కొనసాగించడాన్ని సవాలు చేస్తూ కబడ్డీ కోచ్ పవన్ కుమార్‌యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌తో కూడిన బెంచ్ సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అసోసియేషన్‌లో పార్ట్‌టైమ్ సభ్యులు, ఉద్యోగులు ఉంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ అసోసియేషన్‌లలో సభ్యులుగా ఉండటం వల్ల క్రీడాభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు. అసోసియేషన్‌ల పనితీరుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ క్రీడా అసోసియేషన్‌ల నిర్వహణలో ప్రభుత్వం పాత్ర పరిమితమేనన్నారు. రాష్ట్ర కబడ్డీ సంఘానికి నోటీసులు ఇస్తూవిచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.






# ల్యాప్స్ పాలసీలపై ఎల్ఐసీ ప్రత్యేక ఆఫర్లు

బీమా దిగ్గజం ఎల్ఐసీ.. ల్యాప్స్ పాలసీలు పునరుద్ధరించుకునేవారికి ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 18 నుంచి అక్టోబర్ 17 వరకు మూడు నెలల పాటు వ్యక్తిగత ల్యాప్స్ పాలసీల లేట్ ఫీజుపై 30 శాతం వరకు తగ్గింపునిస్తున్నది. అలాగే నాన్-లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీలపై 30 శాతం లేట్ ఫీజు లేదా గరిష్ఠంగా రూ.5 వేల వరకు రాయితీ పొందవచ్చునని తెలిపింది. చెల్లింపులు జరపనప్పటి నుంచి ఐదేండ్ల లోపు పాలసీలు మాత్రమే ఈ ప్రత్యేక ఆఫర్ కింద చెల్లించుకోవచ్చును. దీంట్లోభాగంగా లక్ష రూపాయల వరకు 30 శాతం లేదా రూ.3,000, రూ.1,00,001 నుంచి రూ.3 లక్షల వరకు 30 శాతం లేదా రూ.4 వేలు, రూ.3,00,001 ఆ పై ప్రీమియంపై 30 శాతం లేదా రూ.5 వేల వరకు రాయితీ పొందవచ్చునని ఒక ప్రకటనలో వెల్లడించింది.